క్లుప్తంగా

చక్రస్నానానికి పోటెత్తిన భక్తులు



చక్రస్నానంలో పాల్గొన్న భక్తులు

కడియం: దుళ్లలోని భూ సమేత వేంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం జరిగిన చక్రస్నానానికి భక్తులు పోటెత్తారు. ఆలయ అర్చకుడు పెద్దింటి లక్ష్మణాచార్యులు పర్యవేక్షణలో వేద పండితులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం చక్రస్నానంలో భక్తులతో కలిసి పాల్గొన్నారు. రాత్రి శ్రీవారికి శ్రీపుష్పయాగం నిర్వహించారు.

ఘనంగా శారదా అమ్మవారి తీర్థం

కడియం: దుళ్ల మార్కెట్ సెంటర్‌లోని శారదా అమ్మవారి తీర్థమహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి, అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం

కడియం: పొట్టిలంకలోని వల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి కల్యాణం బుధవారం వైభవంగా జరిగింది. భక్తుల సహకారంతో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వసతి గృహాల పరిశీలన

కడియం: భద్రతా పరమైన ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎ.వెంకటేశ్వరరావు బుధవారం కడియంలోని ఎస్సీ బాలికల, బీసీ బాలుర వసతి గృహాలను తనిఖీ చేశారు. అక్కడి విశ్రాంతి గదులు, వంటశాలలు, మరుగుదొడ్లు, రక్షణ గోడలు పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డెన్లకు పలు సూచనలు చేశారు. సీసీ కెమెరాల ఏర్పాటు కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. ఆయన వెంట హెచ్‌సీ సీహెచ్ వెంకటరమణ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

కడియం: కడియపులంక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ పొట్టిలంక ఫీడర్‌కు గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా సరఫరా నిలిపివేస్తారన్నారు. దీంతో కడియపులంక, పొట్టిలంక గ్రామాల పరిధిలో వ్యవసాయ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. పొట్టిలంక త్రీ ఫేజ్ వ్యవసాయ మోటార్లకు ఉదయం 5 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉంటుందన్నారు.

రేపు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర మరమ్మతుల నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ ప్రకటించారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ కొబ్బరి కాయల మార్కెట్, పెద్ద వీధి, పల్లపు వీధి, చేగిడి వీధి, కుమ్మరి వీధి, సాయికృష్ణ థియేటర్ రోడ్, మంగళవారపు పేట, మూడు సింహాల బొమ్మవీధి, కొత్తపేట, దర్గా వీధి, స్టేడియం రోడ్డు, స్టేడియం మునిసిపల్ దుకాణాల ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

భక్తిశ్రద్ధలతో సూర్య కల్యాణం



సూర్యకల్యాణం నిర్వహిస్తున్న వడలి కుమార్‌శర్మ

రాజమహేంద్రవరం రూరల్: మాఘ మాసాన్ని పురస్కరించుకుని కొంతమూరు పద్మాక్షి నగర్‌లో వడలి కుమార్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శత చండీ సూర్యారాధన ఘనంగా ముగిసింది. బుధవారం ఉదయం 8.30 గంటల నుంచి సామూహిక సూర్య కళ్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గత నెల 4వ తేదీ నుంచి ప్రతిరోజు సూర్య నమస్కారాలు, శత చండీ హోమాలు, మహాలక్ష్మి ఆరాధన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల ముగింపులో భాగంగా 11.30 గంటలకు మహాపూర్ణాహుతి నిర్వహించి భక్తులకు పెద్ద ఎత్తున ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా వడలి కుమార్ శర్మ మాట్లాడుతూ భక్తులందరికీ అమ్మవారి కరుణ ఉండాలని ఆకాంక్షించారు. సూర్య ఆరాధన ద్వారా ప్రజలకు సంపూర్ణ ఆయురారోగ్యాలు లభిస్తాయన్నారు. తామర పువ్వులతో మహాలక్ష్మి హోమం నిర్వహించినట్టు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

కంబాలచెరువు: స్థానిక భాస్కర్ నగర్‌కు చెందిన మంచెల వెంకటేశ్వరరావు అదృశ్యమైన సంఘటనపై మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో కేసు నమోదైంది. భార్యతో గొడవ జరగడంతో మనస్తాపానికి గురైన వెంకటేశ్వరరావు ఈ నెల 10వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోజూ ఈత.. ఆరోగ్య ప్రదాత

- స్విమ్మింగ్‌తో ఆరోగ్యం
- ఎక్కువ మంది ఆసక్తి



గోదావరిలో ఈత కొడుతున్న స్విమ్మర్లు



స్విమ్మర్స్ క్లబ్ భవనం

ప్రకాశం నగర్: ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి అత్యంత ప్రాధాన్యమివ్వాలి. అది సక్రమంగా ఉన్నప్పుడే జీవితం ఎలాంటి ఇబ్బంది లేకుండా సాగిపోతుంది. అందుకే మన పెద్దలు ఆరోగ్యమే మహాభాగ్యమని ఎప్పుడో చెప్పారు. ఆధునిక సమాజంలో మానవుల జీవన విధానం మారిపోయింది. ముఖ్యంగా శారీరక శ్రమ తగ్గిపోవడంతో రోగాల బారిన పడుతున్నారు. జంక్ ఫుడ్, రసాయనాలు వాడిన ఆహారం తినడం, రాత్రి పూట ఉద్యోగాలు తదితర కారణాలతో నలభై ఏళ్లకే రోగాలు విజృంభిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలని వైద్యులు సూచిస్తున్నారు. వీటిలో ఈతకు ఎంతో ప్రాధాన్యం ఉంది. గోదావరి పక్కనే ఉండడంతో చాలామంది ఈత కొడుతూ వ్యాయామం చేస్తున్నారు.

వాకర్ల సందడి

నగరంలో తెల్లవారుజామునే చాలామంది రోడ్లపై వాకింగ్, రన్నింగ్ చేస్తూ కనిపిస్తారు. అలాగే పార్కుల్లో, గోదావరి తీరంలో వీరి సందడి ఎక్కువగానే ఉంటుంది. మరికొందరు షటిల్, క్రికెట్, వాలీబాల్ తదితర క్రీడలు ఆడుతూ కనిపిస్తుంటారు. ఇంకొందరు వ్యాయామ శాలల్లో గంటల తరబడి వ్యాయామాలు చేస్తున్నారు. అధిక బరువు, భారీ కాయం ఉన్నవారు తొందరగా అనారోగ్య సమస్యలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. దీంతో నగర వాసులు ఎవరికి నచ్చిన వ్యాయామాలు ఎంచుకుని ఆచరిస్తున్నారు.

స్విమ్మింగ్ బెస్ట్

వ్యాయామాలన్నింటిలోనూ ఈత (స్విమ్మింగ్)కు అత్యంత ప్రాధాన్యం ఉంది. ఇది తేలికపాటి వ్యాయామం కావడంతో చేయడానికి చాలా అనువుగా ఉంటుంది. దీంతో చాలామంది స్విమ్మింగ్ వైపు మొగ్గుచూపుతున్నారు. అధిక బరువు కారణంగా వాకింగ్, రన్నింగ్ చేయలేని వారితో పాటు మోకాళ్ల నొప్పులున్న మధ్య వయసు వారికి ఈత ఒక మంచి సాధనంగా మారుతుందని వ్యాయామ విశ్లేషకులు చెబుతున్నారు. స్విమింగ్‌తో భుజాలు, వెన్ను, కాళ్లు, పొట్ట వంటి అన్ని కండరాలకు మేలు జరుగుతుందన్నారు.

నగరంలో అందుబాటులో..

పుష్కరాల రేవులో గోదావరి స్విమర్స్ క్లబ్, రివర్ పూల్, స్పోర్ట్స్ క్లబ్, ఎంప్లాయీస్ రిక్రియేషన్ క్లబ్, రివర్ బే, స్నూకర్స్ జోన్ వంటి స్విమింగ్ పూల్‌లు నగర వాసులకు అందుబాటులో ఉన్నాయి. నగర పాలక సంస్థ సౌజన్యంతో 2009లో పుష్కరాల రేవులో గోదావరి స్విమర్స్ క్లబ్‌లో షవర్ బాత్‌రూమ్‌లు, లైబ్రరీ హాలును ప్రారంభించారు. 8వ డివిజన్‌లో సుమారు రూ.37 లక్షల నగర పాలక సంస్థ సాధారణ నిధులతో జిల్లాలో మొట్టమొదటి చిన్నారుల స్విమింగ్ పూల్, డ్రెసింగ్ రూమ్‌లను ప్రారంభించారు. ఈతపై అభిరుచి ఉన్న చిన్నారులకు ఉదయం, సాయంత్రం వేళల్లో నాలుగు బ్యాచ్‌లుగా బాలబాలికలకు శిక్షణ ఇస్తున్నారు. ఈత నేర్చుకునే విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి తగ్గిపోతుందని, చదువులో ఉత్సాహంగా రాణించగలుగుతారని కోచ్‌లు చెబుతున్నారు.

ఈత మంచి వ్యాయామం



గతంతో పోలిస్తే ఇప్పుడు స్విమ్మింగ్‌పై జనం బాగా ఆసక్తి చూపుతున్నారు. గతంలో సుమారు 20 మంది సభ్యులుగా ఉన్న స్విమ్మర్స్ క్లబ్‌లో ఇప్పుడు 80 నుంచి 90 మంది వరకూ ఉన్నారు. బీపీ, సుగర్, అధిక బరువు, కీళ్ల నొప్పులు ఉన్నవారికి స్విమ్మింగ్ మంచి వ్యాయామంగా ఉంటుంది. ప్రతిరోజూ గోదావరిలో ఈత కొట్టడం మంచి అనుభూతినిస్తుంది.

– రౌతు సూర్యప్రకాశరావు, గోదావరి స్విమ్మర్స్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు

ఎస్‌కేవీటీ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో డీఐ దిలీప్ కుమార్, హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు

కంబాలచెరువు: చెన్నైకు చెందిన జయలలిత సైన్స్ అర్ట్ యూనివర్సిటీ, శ్రీదర్శిని కళారూపం నిర్వహించిన 20వ జాతీయ చిత్రకళా పోటీలో రాజమహేంద్రవరానికి చెందిన ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ విషయాన్ని ప్రధానోపాధ్యాయుడు ఎంవీఎం సుబ్రహ్మణ్యం బుధవారం విలేకరులకు తెలిపారు. ఆ విద్యార్థుల్లో ఎనిమిది మంది వివిధ బహుమతులు గెలుచుకున్నారన్నారు. ఐదు ఉత్తమ ప్రదర్శన అవార్డులు, బంగారు పతకాలు, మూడు రాష్ట్ర ఉత్తమ అవార్డులను కైవసం చేసుకున్నారు. ఈ పోటీలను అక్టోబర్‌లో నిర్వహించి, డిసెంబర్‌లో ఫలితాలు ప్రకటించారన్నారు. అనంతరం పోస్టు ద్వారా బహుమతులను పాఠశాలకు పంపినట్టు తెలిపారు. ఈ మేరకు బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ మాట్లాడుతూ చిత్రలేఖనం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందన్నారు. ఉత్తమ ప్రతిభ, గోల్డ్ మెడల్ పొందిన చరణ్, రాణి రమ్య, ఈశ్వర్, షణ్ముఖ్ అబ్దుల్, మహేష్‌కు మెమెంటోలు అందజేశారు. చిత్రలేఖనంలో విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దుతున్న పాఠశాల డ్రాయింగ్ ఉపాధ్యాయుడు డాక్టర్ పుప్పాల బాపిరాజును డీఐ అభినందించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.అప్పారావు, రమణ, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

23న విష్ణు, లలితా సహస్ర నామ పారాయణ



ఆహ్వాన పత్రాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

రాజమహేంద్రవరం సిటీ: సనాతన ధర్మ వారధి ఆధ్యాత్మిక సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 23న నగరంలోని హిందూ సమాజంలో సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణ నిర్వహిస్తున్నట్లు సంధానకర్తలు మిర్తిపాటి వెంకట్రామయ్య, చిట్టాప్రగడ రాధాకృష్ణ తెలిపారు. ఈ మేరకు బుధవారం హిందూ సమాజంలో ఈ కార్యక్రమ ఆహ్వాన పత్రాన్ని నగర ప్రముఖుడు న్యాపతి సుబ్బారావు, ఆధ్యాత్మికవేత్త మంచిరాజు హేమలత ఆవిష్కరించారు. ఆ రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి ఏడు వరకూ పారాయణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మాదిరాజు శ్రీనివాస్, నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు దూర్వాసుల సత్యనారాయణ, పెదమల్లు వాగ్దేవి, గుడిపూడి గౌతమ్, హరే శ్రీనివాసా భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమ ర్యాంకు సాధనే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: స్వచ్ఛ సర్వేక్షణ్ మార్గదర్శకాలను సక్రమంగా పాటించి, ఉత్తమ ర్యాంకు సాధించడానికి కృషి చేయాలని కమిషనరు కేతన్ గార్గ్ అన్నారు. స్థానిక వెంకటేశ్వరా ఆనం కళాకేంద్రంలో స్వచ్ఛ సర్వేక్షణ్‌పై బుధవారం వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 డివిజన్లలోని 137 లోకేషన్లలో స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకు మదింపు జరుగుతుందన్నారు. తడి, పొడి చెత్తలను విడదీసే కార్యక్రమం వంద శాతం జరిగేలా చూడాలన్నారు. గార్బేజ్ వల్నరబుల్ పాయింట్లను పరిశుభ్ర ప్రదేశంగా మార్చు చేయాలని, ఎమినిటీస్ కార్యదర్శి, శానిటేషను కార్యదర్శి సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్ సమష్టి కృషి చేయాలన్నారు. కాలువల్లో చెత్త తొలగించడానికి మొదటి ప్రాధాన్యమివ్వాలని, కాలువలలో చెత్త వేయకుండా అవగాహన కల్పించాలన్నారు. రాబోయే మూడు రోజులు కాలువలను శుభ్రం చేయడం మీదే పని చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండురంగారావు, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, మున్సిపల్ ఆరోగ్య అధికారి డాక్టర్ వినూత్న, సెక్రటరీ శైలజ వల్లి, మేనేజరు ఎండీ అబ్దుల్ మాలిక్ అస్ఫర్, శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

విశిష్ట గుర్తింపు సంఖ్యతో ప్రయోజనాలు

సీతానగరం: మండలంలోని రైతులందరూ విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖాధికారి కె.సూర్య రమేష్ సూచించారు. మునికూడలి, ముగ్గళ్ల, కూనవరం, వంగలపూడి, రఘుదేవపురం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూమి ఉన్న ప్రతి రైతుకూ విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయించడం ద్వారా వ్యవసాయ సేవలు సులభతరమవుతాయన్నారు. ముందుగా రిజిస్ట్రీ పోర్టల్‌లో వివరాలు నమోదు చేస్తారన్నారు. అనంతరం ప్రతి రైతుకూ ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కేటాయిస్తారని తెలిపారు. దీని ద్వారా ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, సేవలను పొందవచ్చన్నారు. ఆధార్ జిరాక్స్, ఫోన్ నంబర్, పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్‌లతో సమీపంలోని రైతు సేవాకేంద్రాల్లో సంప్రదించాలని రైతులను కోరారు.

బర్డ్ ఫ్లూతో భయం భయం



మిర్తిపాడులో బర్డ్ ఫ్లూ వచ్చిన కోళ్లఫారానికి వెళ్లే దారిని మూసివేసిన దృశ్యం



కోళ్లఫారం యజమాని, సిబ్బందిని పరిశీలిస్తున్న పీహెచ్‌సీ డాక్టర్ చైతన్య

- మిర్తిపాడులో నిషేధాజ్ఞలు
- కోడిమాంసం దుకాణాల బంద్
- ఇంటింటి సర్వే చేపట్టిన వైద్య సిబ్బంది
- అప్రమత్తమైన అధికారులు

సీతానగరం: మిర్తిపాడులోని కోళ్లఫారంలో బర్డ్ ఫ్లూ ప్రబలిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. రెండు రోజుల క్రితం మిర్తిపాడులోని మార్ని సత్యనారాయణ కోళ్ల ఫాంలో సుమారు 8 వేల కోళ్లు చనిపోయాయి. జిల్లాలోని పెరవలి మండలంలో బర్డ్ ఫ్లూ వచ్చిందని నిర్ధారణ అయిన తర్వాత కలెక్టర్ ఆదేశాలతో అధికారులు అప్రమత్తమయ్యారు. మిర్తిపాడు కోళ్లఫారం నుంచి శాంపిళ్లను ల్యాబ్‌కు పంపించగా ఆ వ్యాధి నిర్ధారణ అయ్యింది. దీనితో తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, పీహెచ్‌సీ డాక్టర్ చైతన్య, పశు వైద్యులు డాక్టర్ ఫణీంద్ర, ఎస్సై రామ్ కుమార్ తదితరులు పటిష్ట చర్యలు చేపట్టారు.

చనిపోయిన కోళ్లను గోతుల్లో వేయించి, మట్టితో మూయించారు. పీహెచ్‌సీ డాక్టర్ చైతన్య ఆ గ్రామంలో ఇంటింటి సర్వే చేపట్టారు. కోళ్ల ఫారంలో ఉన్న ముగ్గురి నుంచి శాంపిళ్ల సేకరించి ల్యాబ్‌కు పంపించగా ఎటువంటి లక్షణాలు లేవని తెలిపింది. రొంప, దగ్గు, ఒకేసారి జ్వరం రావడం, ఒళ్లు నొప్పులు బర్డ్‌ఫ్లూ లక్షణాలని, దీనిపై ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తున్నారని పీహెచ్‌సీ డాక్టర్ చైతన్య తెలిపారు. మండల గ్రామాల్లో చికెన్ దుకాణాల్లో కోడి మాంసం, కోడిగుడ్ల అమ్మకాలు నిషేధించారు.

అనకొండలు



కోరుకొండ ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న లేఅవుట్‌లో వేసిన పోలవరం కాలువ గట్టుమట్టి



మట్టిని తరలిస్తున్న భారీ వాహనం

- గ్రామాల్లో కరిగిపోతున్న కొండలు
- అక్రమంగా మట్టిని తరలిస్తున్న మాఫియా
- కూటమి నాయకుల అండదండలు!

మధురపూడి: రాజానగరం నియోజకవర్గంలో కొండలు కరిగిపోతున్నాయి. కొందరు అక్రమార్కులు అనకొండల్లా మారి వీటిని మింగేస్తున్నారు. కొండలను తవ్వేసి మట్టిని అమ్ముకుంటున్నారు. నిత్యం భారీ లారీలపై తరలిస్తూ కాసులు మూటగట్టుకుంటున్నారు. నియోజకవర్గంలోని మూడు మండలాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఈ అన్యాయాన్ని ప్రశ్నించిన వారిపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువ, పుష్కర కాలువలు ఇరువైపులా ఉన్న మట్టిని భారీ వాహనాల్లో తరలించుకుపోతున్నారు. ఈ దందాను అధికారులు కూడా చూసీచూడనట్టు వదిలేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అక్రమార్కులు

కోరుకొండ మండలంలోని కొండలపై అక్రమార్కుల కన్ను పడింది. శ్రీరంగపట్నం, కణుపూరు, కోటికేశవరం, కాటవరం, పురుషోత్తపట్నం, రాఘవపురం, కలవచర్ల తదితర గ్రామాల్లోని కొండలన్నీ కరిగిపోతున్నాయి. ప్రకృతి పరంగా ఏర్పడిన కొండలకు రక్షణ లేకుండా పోయింది. వీటితో పాటు చెరువుల్లోని మట్టిని కూడా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వంలోని నాయకుల అండదండలతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు.



శ్రీరంగపట్నంలో అక్రమార్కులు తవ్వేసిన కొండ

భారీ వాహనాల్లో తరలింపు

సుమారు 10 నుంచి 16 చక్రాలున్న భారీ వాహనాల్లో మట్టిని తరలిస్తున్నారు. వీటిలో 15 నుంచి 18 టన్నులు మాత్రమే లోడు చేయాల్సి ఉండగా, 20 నుంచి 30 టన్నుల మట్టిని వేస్తున్నారు. లెక్కాపత్రం లేకుండా నిబంధనలకు విరుద్ధంగా రవాణా చేస్తున్నారు. భారీ వాహనాలు, యంత్రాలను వినియోగించడంతో గంటల్లోనే మట్టికొండ మాయమవుతోంది.

రక్షణ కరువు

సీతానగరం మండలంలోని గోదావరి నుంచి విశాఖపట్నం వైపునకు ఏర్పాటు చేసిన పోలవరం లెఫ్ట్ కెనాల్, పుష్కర కాలువలకు ఇరువైపులా ఉన్న మట్టి మాయమైంది. ఆ సమీపంలోని మట్టిని కూడా అక్రమంగా తరలిస్తూ ప్రభుత్వాదాయానికి గండి కొడుతున్నారు. కాలువలకు ఇరువైపులా ఉన్నమట్టిని తరలించడంతో ఎటువంటి ప్రమాదాలు వస్తాయోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయానికి ఉపయోగపడే చెరువులు, ప్రభుత్వ భూములను సైతం విడిచి పెట్టకుండా మట్టి మాఫియా టన్నుల కొద్దీ మట్టిని తరలిస్తోంది. రాత్రి సమయంలో ఈ అక్రమ దందా యథేచ్ఛగా జరుగుతోంది.

యథేచ్ఛగా దోపిడీ



కూటమి నాయకుల కనుసన్నల్లో యథేచ్ఛగా దోపిడీ జరుగుతోంది. రాత్రి వేళల్లో కొండలను తవ్వేసి మట్టిని తరలించుకుపోతున్నారు. ఈ సమయంలో వేగంగా వాహనాలు నడపడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. మారుమూల గ్రామాల్లో భారీ వాహనాలు తిరగడంతో ప్రజలకు బెంబేలెత్తిపోతున్నారు.

– నక్కా రాంబాబు, గుమ్ములూరు సర్పంచ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్

మట్టి మాఫియా



ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన కొండలపై మట్టి మాఫియా కన్ను పడింది. కొండలతో పాటు కాలువ గట్లను కొల్లగొడుతూ అక్రమంగా కాసులు సంపాదిస్తున్నారు. మట్టి మాఫియాను నియంత్రించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి. కట్టుదిట్టమైన చర్యలు చేపట్టి కొండలను కాపాడుకోవాలి.

– ఏడిద ప్రసన్నకుమార్, యువ నాయకుడు, ప్రభుత్వ ఆస్తుల సంరక్షణ సంస్థ

వేపచెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోండి



రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న బొమ్మూరు గ్రామస్తులు

సాక్షి ఇంపాక్ట్

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని క్రైస్తవ శ్మశాన వాటికలో వేపచెట్లను నరికిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని బుధవారం డీఆర్‌వో, రూరల్ తహసీల్దార్‌లకు వినతిపత్రం అందజేశారు. 'కాటినీ వదలని కూటమి నాయకులు' అనే శీర్షికతో బుధవారం సాక్షి దినపత్రికలో వచ్చిన కథనానిని గ్రామస్తులు స్పందించారు. మాజీ ఉప సర్పంచ్ దాకే శ్రీనివాసరావు, మరి కొందరు కలిసి జిల్లా కలెక్టరేట్‌లో డీఆర్‌వో సీతారామ్మూర్తిని కలిశారు. క్రైస్తవ శ్మశాన వాటికలోని 31 వేపచెట్లను నరికివేసి పట్టుకుపోయారని, దీనిపై పూర్తి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ భాస్కర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పరిమి సాల్మన్, తోడేటి రాహుల్, బండిల చందు, పమ్మి నాని తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వంద రోజుల పని కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ నాగ మహేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్: ఉపాధి హామీ కూలీలకు వంద రోజులు పని కల్పించడానికి ఫీల్డ్ అసిస్టెంట్లు కృషి చేయాలని డ్వామా పీడీ నాగమహేశ్వరరావు ఆదేశించారు. హుకుంపేట మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం రాజానగరం, కడియం, రాజమహేంద్రవరం రూరల్ మండలాల ఫీల్డ్ అసిస్టెంట్లకు సాంకేతిక అంశాలపై శిక్షణ నిర్వహించారు. పీడీ నాగ మహేశ్వరరావు మాట్లాడుతూ చెరువులు, కాలువలు, ఫార్మ్‌పాండ్స్, చేపల చెరువుల్లో కొలతల ప్రకారం పని చేయించి, దినసరి వేతనం రూ.300 వచ్చేలా చూడాలన్నారు. డ్వామా ఏపీడీ రామప్రసాద్, ఏపీవో సత్యవతి, జిల్లా రిసోర్స్‌పర్సన్లు వైబీఎన్ రాజేష్, చక్రవర్తి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి



ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు



భీమడోలు దయామణి (ఫైల్)

కంబాలచెరువు: ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నిడదవోలు మండలం తిమ్మరాజుపాలేనికి చెందిన భీమడోలు మనోహర్, భార్య దయామణి (48) జేఎన్ రోడ్డులోని ఒక వివాహ వేడుకకు వచ్చారు. అనంతరం తమ ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరారు. నగరంలోని షెల్టాన్ హోటల్ సమీపంలోకి వచ్చేసరికి రాజమహేంద్రవరం నుంచి కాకినాడ వెళ్తున్న ఆర్టీసీ బస్సు వీరు వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనంపై నుంచి భార్యాభర్తలిద్దరూ రోడ్డుపై పడిపోయారు. ఆ సమయంలో ఆర్టీసీ బస్సు టైరు దయామణి తలపై నుంచి వెళ్లిపోవడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మనోహర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటనతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. ఆర్టీసీ ఆర్ఎం సంఘటనా స్థలానికి చేరుకుని మృతురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడారు.

సినిమాలు



శ్యామల	సంక్రాంతికి వస్తున్నాం
సూర్యమినీ	బడాస్ రవికుమార్
సూర్యప్యాలెస్	పట్టుదల
స్వామి	సంక్రాంతికి వస్తున్నాం
శివజ్యోతి	తండేల్
అనుశ్రీ	ఒక పథకం ప్రకారం, మదగజరాజ
రాజా	తండేల్
ఊర్వశి	డాకు మహారాజ్
మేనక	గేమ్‌ఛేంజర్
రంభ	ఒక పథకం ప్రకారం, మార్కో
కుమారి	తండేల్
అప్సర	తండేల్
అశోక	పట్టుదల
నామవరం	
విఎస్.మహల్	తండేల్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	తండేల్
కడియం	
వెంకటసూర్య	తండేల్